క్లుప్తంగా

16న మండల పరిషత్ సమావేశం

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం అజెండా వివరాలను సభ్యులకు, అధికారులకు ఇప్పటికే అందించినట్టు తెలిపారు.

కపిలేశ్వరపురంలో శాంతి కల్యాణం



కపిలేశ్వరపురంలో శాంతి కల్యాణ పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: స్థానిక గాంధీ సెంటర్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం శాంతి కల్యాణ పూజలు చేశారు. రిటైర్డ్ ఆడిటర్ సుగంధం వీరవెంకట సత్యనారాయణ కుమారులు బాల సత్యనాగేంద్ర, దేవి దంపతులు, భవాని నాగేంద్ర, సునీత దంపతులు పూజలు చేశారు. అనంతరం వారి ఆర్థిక సౌజన్యంతో భారీ అన్నదానం నిర్వహించారు.

బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్

రామచంద్రపురం: ఇటీవల లారీ ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన గుబ్బల శ్రీను భార్య కీర్తికి డాక్టర్ వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సాయంగా రూ.10 వేల చెక్కును 13వ వార్డు కౌన్సిలర్ కేతా శ్రీను చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ గుబ్బల సూరిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ పాల్గొన్నారు.

ఎస్‌డీజీ సర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు

రాయవరం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ) సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌పై ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్డులకు, ఈకేవైసీని వేగవంతం చేయాలన్నారు. 0–6, ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆయా గ్రామాల్లోని లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీవో వరాహలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాట్లాడారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



జస్టిస్ మాధవీదేవి

రామచంద్రపురం: ఈ నెల 13 న ఉదయం 10.30 గంటల నుంచి రామచంద్రపురంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి గురువారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అందువలన కక్షిదారులు లోక్ అదాలత్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు, రెవెన్యూ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు అందరూ పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించబడేలా సహకరించాలని సూచించారు.

14 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

యానాం: ఈ నెల 14 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (వైడీసీఏ) అధ్యక్షుడు పంతగడ సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 16 సంవత్సరాల బాల బాలికలకు ఈ శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.

సేవే లక్ష్యం...

- మానవత్వానికి చిరునామా నర్స్
- ప్రజారోగ్య పరిరక్షణలో శ్రమిస్తున్న వైనం
- రెండు నియోజకవర్గాల్లో వందలాది మంది సేవలు
- నేడు ప్రపంచ నర్సింగ్ దినోత్సవం



అంగర పీహెచ్‌సీలో కరోనా వ్యాక్సిన్ వేస్తున్న నర్సులు (ఫైల్)

కపిలేశ్వరపురం: మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ప్రతి ఒక్కరికీ ఓ అవకాశం వస్తూనే ఉంటుంది. మనిషి ప్రాణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం దక్కడం అన్నింటిలో ఓ అద్భుత అవకాశం. వైద్య రంగంలో డాక్టర్‌కు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ప్రాణరక్షణకై విశేష కృషి చేసే నర్సులకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. రాత్రింబవళ్ళు రోగుల ప్రాణ రక్షణకు వారు పాటుపడతారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పిస్తారు. ఇలా.. నిరంతరం కృషి చేసే నర్సుల సేవలను గుర్తించడం మానవ ధర్మం. నేడు నర్సింగ్ దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

ఇదీ నేపథ్యం

ఇటలీలోని ధనిక కుటుంబంలో 1820, మే 12న జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1910 ఆగస్టు 13 వరకూ జీవించారు. యుద్ధ క్షతగాత్రులకు, ప్రకృతి వైపరీత్యాలతో గాయాలైనవారికి వైద్యసేవలందించడంతో పాటు వైద్య సేవలపై పలు రచనలు చేశారు. ఈమె జన్మదినమైన మే 12న ప్రపంచ నర్సింగ్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

రెండు నియోజకవర్గాల్లో నర్సులు ఇలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 16 పీహెచ్‌సీలలో 48 మంది స్టాఫ్ నర్సులు, 29 మంది ఫార్మాసిస్టులు ఉన్నారు. వారితోపాటు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో ఏఎన్ఎంలుగా రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో వేలాది మంది సేవలు అందిస్తున్నారు. ఆశ కార్యకర్తలు గర్భిణి, బాలింతల బాగోగులు చూసుకుంటున్నారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో 5,777 మంది నర్సుల పోస్టులను, 10,032 మంది ఎంఎల్‌హెచ్‌పీలను 9,751 మంది పారా మెడికల్ సిబ్బందిని ప్రస్తుత ప్రభుత్వం నియమించింది.

సేవలు అమోఘం...

రాష్ట్రంలో 3,86,86,305 మందికి ఆరోగ్య పరీక్షలు పూర్తి చేసి వారందరికీ హెల్త్ ఐడీలను జారీ చేసింది. ఈ విషయంలో నేషనల్ హెల్త్ అథారిటీ–ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఏపీకి రెండో స్థానాన్ని ప్రకటించడంలో క్షేత్ర స్థాయి వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 54 నర్సింగ్ స్కూళ్లలో చదువుకున్న వందలాది మంది నర్సింగ్ విద్యార్థులు ఉద్యోగంలో చేరాక వివిధ స్థాయిల్లో ఆరోగ్య, ప్రాణ పరిరక్షణకై కృషి చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పేరుతో గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో 555 మంది గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి సంరక్షిస్తున్నారు. వారిలో 128 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించి మరింత మెరుగైన సేవలు అందిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో 325 పాఠశాలల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో 28,192 విద్యార్థులకు రక్తహీనత స్థాయిని పరీక్షించి మందులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి కరోనా కేసు నమోదైన 2020 మార్చి 24 నుంచి నేటి వరకూ అనేక పర్యాయాలు క్షేత్రస్థాయిలో కరోనా పరీక్షలు చేయడం, వ్యాక్సిన్ వేయడమనే సేవలందిస్తూనే ఉన్నారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లోని సుమారు 750 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకూ జిల్లా వ్యాప్తంగా 3,361 మంది తల్లీ బిడ్డలను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంలో నర్సులు కృషి ఉంది. 2022 డిసెంబర్‌వరకూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 43,164 మంది లబ్ధిదారులకు రూ.157.31 కోట్ల విలువైన చికిత్స చేయగా వారందరికీ నర్సులు సేవలందించారు.

సేవేలక్ష్యంగా పనిచేస్తున్నాం



నేను అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని వడ్లమూరులో ఏఎన్ఎంగా పని చేస్తున్నాను. నాతోటి వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రిలోని స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు ఇలా అందరూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు. వైద్యుల ఆదేశాలపై చికిత్స, ప్రభుత్వ ఆదేశాలపై ఆరోగ్య కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం.

– పేరూరి విజయదుర్గ, ఏఎన్ఎం, అచ్యుతాపురం పీహెచ్‌సీ

భోజనం బల్లల అందజేత



భోజనం, భోజనం బల్లలు అందజేస్తున్న కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్

రామచంద్రపురం: పట్టణంలోని సువార్తపేటలో ఉన్న కుష్ఠు వ్యాధి బాధితులకు భోజనాలు చేయడానికి అనువుగా 4 స్టీలు భోజనం బల్లలను మండలంలోని వెల్లసావరానికి చెందిన కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ (డాక్టర్ సత్తిబాబు) గురువారం అందజేశారు. డీపీఎంఆర్ కేస్ కౌన్సెలింగ్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు ఇంత సుకుమార్, రిటైర్డ్ డీపీఎంఓ కృష్ణారావు, నీలిమ ఐస్‌క్రీమ్ పార్లర్ అధినేత సుబ్రహ్మణ్యం, సాదే జార్జిబాబు, మాధవరపు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ వైద్య పరమైన ఇబ్బందులు వచ్చినపుడు అండగా ఉంటామన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి బాధితులకు ఉండే చట్టపరమైన రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. బాధితులు 35 మందికి భోజనాలు అందించారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఉండూరు పీఏసీఎస్ చైర్మన్ దంగేటి చినబాబు, సంస్థ సభ్యులు కొప్పిశెట్టి సురేంద్ర త్రిపాఠి, పిల్లి శేషగిరి పాల్గొన్నారు.

వడివడిగా వరి కోతలు

- ప్రతికూల వాతావరణంతో నాలుగు రోజులు నిలిచిన పనులు
- వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం పనులు ముమ్మరం



మండపేటలో ముమ్మరంగా జరుగుతున్న వరి కోతలు

మండపేట: ద్రోణి ప్రభావంతో నిలిచిపోయిన రబీ తుది దశ పనులు నాలుగు రోజులుగా మరలా జోరందుకున్నాయి. వాతావరణం ఎప్పుడెలా ఉంటుందన్న ఆందోళనతో త్వరితగతిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 92,862 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. 3.4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. మండపేట నియోజకవర్గంలో ముందుగా సాగు జరగడంతో రెండు వారాల క్రితమే వరికోతలు మొదలయ్యాయి. ఈ నియోజకవర్గంలో 70 శాతం వరి కోతలు పూర్తవగా, రామచంద్రపురం నియోజవర్గంలో 60 శాతం కోతలు జరిగాయి. ఈ దశలో ద్రోణి ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. నాలుగు రోజులుగా వాతావరణం అనుకూలించడంతో రైతులు పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గురువారం వరికోత యంత్రాలు తీరిక లేకుండా పనిచేయడం కనిపించింది. ఎప్పటికప్పుడు కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా పొలాల్లోంచి రోడ్లు, కళ్లాల్లోకి తరలించుకున్నారు. ఇప్పటికే కళ్లాల్లో ఉన్న ధాన్యంలో తేమ శాతం తగ్గించుకునేందుకు ఆరబెట్టుకోవడం, ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు తరలించుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

రైతులకు ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసింది. డివిజన్‌లో 131 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 45 శాతం మేర ధాన్యం కొనుగోళ్లు జరిగినట్టు అంచనా. క్షేత్రస్థాయిలోకి వెళ్లి మిగిలిన ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు సిబ్బంది కృషి చేస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేసి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మండపేట మండలంలో 16,600 ఎకరాల్లో రబీ సాగుచేయగా ఇప్పటి వరకూ 80 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తయినట్టు ఏవో కె ఏసుబాబు తెలిపారు. మండల పరిధిలో ఇప్పటి వరకు ఆర్‌బీకేల ద్వారా తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. వారం రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే మండలంలో చాలా వరకు దాళ్వా పనులు పూర్తవుతాయని ఆయన వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తోటపేటలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాపు ఐక్య వేదిక సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటకు చెందిన గంధం వెంకట్రావు కుటుంబానికి నియోజకవర్గ కాపు ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. వెంకట్రావు కుమారుడు గంధం సత్తిబాబు ఇటీవల మృతి చెందాడు. వెంకట్రావుకు కాలు ఇన్‌ఫెక్షన్ కావడంతో మడమ సగం వరకు తీసేశారు. రెండో కాలు పనిచేయడం లేదు. భార్య కూడా అనారోగ్యంతో మంచంపైనే ఉంటున్నారు. దీనితో వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు మాగాపు అమ్మిరాజు, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ, నక్కా భీమశంకరం, భీమేష్, రమేష్, తాతేలు, సత్తి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలి



చేదువాడలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

కాజులూరు: ప్రతీ హిందువూ తన ధర్మం కోసం పాటుపడిన నాడే హిందూ ధర్మంపై దాడులు అరికట్టబడతాయని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కంచి గోవిందరాజు అన్నారు. గురువారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు మండలంలోని చేదువాడ, కాజులూరు, కుయ్యేరు తదితర గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంచుతూ, స్టిక్కర్లు అతికిస్తూ 'ఇంటింట ధర్మ ప్రచారం' కార్యక్రమం నిర్వహించారు. చేదువాడలో కంచి గోవిందరాజు మాట్లాడుతూ ధర్మ పరిరక్షణే దేశానికి రక్ష అని ప్రతి ఒక్కరూ ధర్మపరిరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాసాబత్తుల నరసింహమూర్తి, చింతపల్లి వెంకటేశ్వర్రావు, కురుపూడి శేషారత్నం, పెంకే కనకదుర్గా తదితరులు పాల్గొన్నారు.


అప్రోచ్ నిర్మించాలి



దంగేరు–శివల రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు అంటున్నారు. కనీసం ఇక్కడ గ్రావెల్ అయినా వేసి తాత్కాలిక ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే అక్కడ అప్రోచ్ నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని అముజూరు ఎస్సీ కాలనీలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపాలకృష్ణ, నాతి లోవరాజు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కపిలేశ్వరపురానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య శిబ్బంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం కపిలేశ్వరపురం ఆసుపత్రికి తరలించామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కాటే సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నానాపరపు కళ్యాణి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. కోడూరు సత్యనారాయణ, నానాపరపు శ్రీనివాస్, నాతి రామకృష్ణ, సాదే కొండ, సహదేవుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం ఆలయం



కోరుమిల్లి అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: భక్తులు నిర్మించుకున్న ఆలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లిలో గౌతమి గోదావరి నది ఒడ్డున భక్తులచే కొత్తగా నిర్మించిన ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాస్, లక్ష్మి దంపతులు పూజలు చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట తనయుడు పృథ్వీ రాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ఆచంట వీరవెంకట స్వామి, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు స్వామివారిని దర్శించుకున్నారు.

21న నమామి సాయి శత రుద్రీయం



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న బులుసు వెంకటేశ్వర్లు

రంగంపేట: ఈ నెల 21న రాజమహేంద్రవరంలో నిర్వహించే నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల కన్వీనర్ల అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు జరిగే 2025 నాటికి 108 నమామి సాయి శత రుద్రీయాలు చేయాలన్నది లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా 42వ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు పూర్ణ కలశంతో సత్య సాయి చిత్రపటాన్ని, పాదుకలను నగరంలో ఊరేగిస్తామని, 7 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, గోపూజ, 8 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని రాష్ట్ర వేదాధ్యయన సమన్వయకర్త హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యాన నిర్వహిస్తారని వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమ కరపత్రాలను, ఆహ్వాన పత్రికలను విడుదల చేసి, సంస్థ సభ్యులకు అందించారు. ప్రతి గురువారం నారాయణ సేవ చేస్తున్న ఈలకొలను సేవా సమితి కృషిని అభినందించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, జిల్లా సమన్వయకర్త బి.విజయ సాయి, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, సజ్జోన్ కన్వీనర్ మల్లెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు సముచిత స్థానం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీలో బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎన్నికల్లో సైతం అన్ని వర్గాల వారికీ ప్రాధాన్యం ఇచ్చి సామాజిక సమతూకం పాటించారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత నియోజకవర్గానికి తొలిసారిగా వచ్చిన ఆయనను స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు కూడా ఇజ్రాయిల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ పాదూరి డేవిడ్‌రాజు, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు మల్లిడి నితిన్‌రెడ్డి, వార్డు సభ్యురాలు నూతిక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మసీదు స్థలానికి అధికారుల రీసర్వే



సర్వే అధికారులతో మాట్లాడుతున్న మసీదు కమిటీ సభ్యులు

మండపేట: పట్టణంలోని పెద్ద మసీదు స్థలాన్ని గురువారం వక్ఫ్ బోర్డు అధికారులు రీసర్వే చేశారు. మసీదు పక్కనే ప్రైవేట్ స్థలంలో భవన నిర్మాణం సందర్భంగా ఇటీవల స్థల వివాదం తలెత్తిన విషయం విదితమే. మసీదు స్థలాన్ని ప్రైవేట్ స్థలం యజమానులు ఆక్రమించి భవన నిర్మాణం చేస్తున్నారంటూ అందిన ఫిర్యాదులపై గతంలోనే వక్ఫ్ బోర్డు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పలుమార్లు సర్వేలు చేశారు. మసీదు స్థలానికి రికార్డులు సక్రమంగా లేకపోవడం, కోర్టు తీర్పు, రికార్డుల ఆధారంగా వివాద స్థలం ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా నిర్ధారించారు. వివాదంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జోక్యం చేసుకుని మసీదు కమిటీ సభ్యుల కోరిక మేరకు స్థల యజమానులతో మాట్లాడి 2.6 అడుగుల దారి మార్గాన్ని గిఫ్ట్‌గా ఇచ్చేందుకు వారిని అంగీకరింప చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్థలం రీసర్వే చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సర్వే కమిషనర్లు రమణమూర్తి, తోజాక్షరావు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆడిట్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీవుల్లా, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు రీసర్వే చేశారు. అటు రాజారత్న బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నుంచి ఇటు వల్లూరి వారి వీధి నుంచి మున్సిపల్, రెవెన్యూ, వక్ఫ్ బోర్డు అధికారుల రికార్డుల ఆధారంగా సర్వే చేశారు. స్థల యజమానులతో పాటు మసీదు కమిటీ సభ్యులు అల్తాఫ్, రబ్బానీ, కరీం తదితరులు హాజరయ్యారు. కామన రీసర్వేను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాగా మసీదు స్థలం ఆక్రమణలకు గురికాలేదని, వివాదస్పద స్థలం ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా తేల్చినట్టు సమాచారం.

సమన్వయంతో ఫిర్యాదులు పరిష్కరించాలి



కలెక్టర్ హిమాన్షుశుక్లా వీసీలో పాల్గొన్న రాయవరం మండల స్థాయి అధికారులు

రాయవరం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదును అన్ని శాఖల అధికారులు కోఆర్డినేషన్‌తో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సూచించారు. మండల స్థాయి అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో డి.శ్రీనివాస్, ఎస్సై పీవీఎస్ఎన్ సనుసురేష్, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రతి సమస్య పరిష్కారంలో వివిధ శాఖల అవసరం ఏర్పడుతుందన్నారు. సమస్యకు సంబంధం ఉన్న శాఖల అధికారులు సమస్య పరిష్కారంలో పాల్గొని, అర్జీదారుడు సమస్య పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా సూచించారు. ఇందుకోసం ప్రతి సోమవారం, శుక్రవారం మండల స్థాయిలో సమావేశమై, వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం తీసుకున్న చర్యలను చర్చించాలన్నారు. దీని వలన సమస్యలు పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సమస్య పరిష్కారంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించరాదన్నారు.

పెట్రోలియం డీలర్లు నిబంధనలు పాటించాలి

యానాం: నియోజకవర్గంలోని అన్ని పెట్రోలియం రిటైల్ ఔట్‌లెట్ యాజమాన్యాలు తప్పనిసరిగా పుదుచ్చేరి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని యానాం ప్రాంతీయ పరిపాలనా అధికారి (ఆర్ఏఓ), పౌర సరఫరాల అధికారి మునిస్వామి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రతి డీలరూ తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని, క్రాస్ వెరిఫికేషన్ కోసం పౌర సరఫరాల అధికారికి మాత్రమే దీనిని సమర్పించాలని పేర్కొన్నారు. మోటార్ స్పిరిట్ (ఎంఎస్), హైస్పీడ్ డీజిల్ (హెచ్ఎస్‌డీ) ప్రతి విక్రయానికి సంబంధించిన బిల్లు, రశీదు నిర్వహించాలన్నారు. నాన్ బల్క్, రెసెప్టకిల్స్‌లో 2,500 లీటర్ల కంటే ఎక్కువ హెచ్ఎస్‌డీ విక్రయాలు ఉంటే పౌర సరఫరాల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని పెట్రోల్ బంకులు పగటి పూట మాత్రమే నిర్వహించి, రాత్రి వేళల్లో మూసివేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, బంకులు 24 గంటలూ పని చేయాలని ఆదేశించారు. ఆయా బంకుల వద్ద తప్పనిసరిగా శుభ్రమైన టాయ్‌లెట్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. బంకుల సాధారణ విధుల్లో ఎవరూ అనవసర జోక్యం చేసుకోరాదని, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పెట్రోలు బంకుల పనితీరుపై ఫిర్యాదులను సంబంధిత పౌర సరఫరాల అధికారికి సమర్పించాలని మునిస్వామి సూచించారు.